# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేది.06.10.2014

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చొరవతో 108 అంబులెన్స్‌లన్ని మళ్లీ రోడ్డెక్కాయి. రిపేరులో వున్న దాదాపు 10 వాహనాలు మినహా మిగతా 300 పైగా వాహనాలన్నీ వైద్యసేవల్లో పాల్గొంటున్నాయి. 316 అంబులెన్స్‌ల్లో 70 వాహనాల వరకు వైద్య సేవల్లో పాల్గొనడం లేదనే సమాచారం అందడంతో ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. 108 అంబులెన్స్‌లన్నీ వైద్యసేవల్లో పాల్గొనాల్సిందేనని, కుంటి సాకులతో అంబులెన్స్‌లను ఆపవద్దని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, జివికె సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 108 అంబులెన్స్‌ల విషయంలో భవిష్యత్తులో ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. డిప్యూటి సిఎం డా. రాజయ్యతో పాటు ఇతర అధికారులతో ముఖ్యమంత్రి సోమవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో డిప్యూటి సిఎం డా.రాజయ్య, జివికె సంస్థ సిఇఓ విద్యాసాగర్, కో ఆర్డినేటర్ సుశీల, ఎన్ఆర్‌హెచ్ఎం డైరెక్టర్ డా.కల్పన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కిషోర్‌లతో సమీక్ష నిర్వహించారు.

రాష్ట్రంలో 316 108 అంబులెన్స్‌లు వుండగా దాదాపు 70 వాహనాలు నిలిచిపోయినట్లు ప్రభుత్వానికి సమాచారం వచ్చిందని డిప్యూటి సిఎం అన్నారు. అలా ఎందుకు చేశారని జివికె ప్రతినిధులను నిలదీశారు. రాష్ట్రం సమైక్యంగా వున్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేయకపోవడం వల్లనే జివికే కు చెల్లించాల్సిన బకాయిలు ఆగిపోయాయని అన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేక జి.ఓ తేవాల్సి వుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన జూన్ మాసం నుండి జివికే కు ఇవ్వాల్సిన డబ్బులు యధావిధిగా అందుతున్నాయని డా.రాజయ్య చెప్పారు. జివికె సంస్థ వాహనాల నిర్వహణను సక్రమంగా నిర్వర్తించాలని కూడా కోరారు. సమస్యలేవైనా వుంటే ప్రభుత్వంతో చర్చించాలి తప్ప ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని కూడా సూచించారు. మొత్తంగా ముఖ్యమంత్రి చొరవ చూపడంతో అంబులెన్స్‌లన్నింటిని యధావిధిగా నడుపుతున్నట్లు జివికె సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం